క్లుప్తంగా

ఫ్లైఓవర్ పనులకు అనుమతులిప్పించండి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: అసంపూర్తిగా ఆగిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు అనుమతులు ఇప్పించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కోరినట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కలిసి, గూడూరు ప్రజల చిరకాల కోరిక అయిన ఫ్లైఓవర్ గురించి చర్చించామన్నారు. దీనిపై సీఎం స్పందించారని, బడ్జెట్ సమావేశాలు అయిన వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం రేపు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని చంద్రబాబు కాలనీలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కామిరెడ్డి రాజారెడ్డి బుధవారం తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వేడుకల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి గంధమహోత్సవం

ఓజిలి: మండల కేంద్రంలోని ఖాదర్‌అవులియా 34వ గంధమహోత్సవాన్ని గురువారం నుంచి రెండు రోజులు పాటు నిర్వహించనున్నట్లు దర్గాకమిటీ, ముస్లిం యూత్ సభ్యులు తెలిపారు. ఈ గంధమహోత్సవాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ప్లేట్ల వితరణ



భోజన ప్లేట్లు అందజేస్తున్న గ్రామపెద్దలు

సైదాపురం: మండలంలోని దాడిశెట్టిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కృష్ణా మైనింగ్ కంపెనీ భోజన ప్లేట్లను వితరణ చేసింది. వాటిని హెచ్ఎం రవి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న దాతల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్, అంగన్‌వాడీ కార్యకర్త శాంతమ్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ చలివేంద్రం ప్రారంభోత్సవంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

చిల్లకూరు: ముత్యాలమ్మ జాతరకు వచ్చే భక్తులకు మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. గూడూరుకు చెందిన సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఉదయం నుంచి భక్తులకు మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను అందజేశారు. జాతర సందర్భంగా మూడు రోజుల పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాహార్తి తీర్చేలా పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్‌రెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, సిద్ధారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ



మాట్లాడుతున్న టాటా కెమికల్ సర్వీసు ప్రతినిధి

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్‌పై తడ మండలం మాంబట్టులో ఉన్న టాటా కెమికల్ సర్వీస్ ప్రతినిధులు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. టాటా కెమికల్స్ సర్వీస్ కంపెనీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విశ్వజిత్, హెచ్ఆర్ మేనేజర్ శంకర్, నాగార్జునతో పాటు మహిళా ప్రతినిధులు కూడా కళాశాలకు విచ్చేసి, విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. డిగ్రీ తరువాత విద్య, ఉపాధి అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. డిగ్రీ తరువాత ఉపాధి కావాలనుకుంటే బెంగళూరు, హైదరాబాద్, చెన్నై లాంటి నగరాలకు వెళ్లి ఆరు నెలలు పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ తీసుకుంటే ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. లేదంటే డిగ్రీ తరువాత ఉపాధి నిచ్చే కోర్సులు, లేదంటే పీజీ చేస్తే మరిన్ని అవకాశాలు మీవద్దకే వస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ, జేకేసీ కోఆర్డినేటర్ ఎం యలమంద రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవం..గురునాథస్వామి గ్రామోత్సవం



ఊరేగుతున్న యారా గురునాథస్వామి



ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

● అలరించిన గొల్లల వేడుక

చిల్లకూరు: తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో నిర్వహించే జాతరలో భాగంగా రెండో రోజైన బుధవారం నిర్వహించిన గొల్లల వేడుక అలరించింది. వేడుకల్లో భాగంగా పోలేరమ్మను రజకుల ఇంటి నుంచి తీసుకుని వచ్చి గంటమిట్ట మీద కొలువుదీర్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. క్యూల్లో రద్దీ నెలకొనడంతో అమ్మవారి దర్శనానికి గంట సమయంపైగా పడింది. సాయంత్రం గంటమిట్ట మీద నుంచి యారా గురునాథస్వామి, అంకమ్మ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పంబ లోళ్ల డప్పు, మంగళ వాయిద్యాల నడుమ గురునాథస్వామి, అంకమ్మల విగ్రహాలను చప్పరంపై ఉంచి ముందు గణాచారి



వేయికళ్ల దుత్తలతో వెళుతున్న భక్తులు

నడుస్తుండగా మేళతాళాల నడుమ గ్రామోత్సవం పురవీధుల్లో సాగింది.

భక్తులను ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జాతరకు వచ్చిన భక్తులు రాత్రి సమయాల్లో ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్న తలంపుతో దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ అభినయంతో నాటికలు, నాటకాలు, ఏక పాత్రాభినయాలు ప్రదర్శించారు. అలాగే చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

శాస్త్రోక్తంగా పలకి సేవ

జాతర సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి పలకిసేవ నిర్వహించారు. దాతల సహకారంతో బంగారు చీరను అలంకరించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు వేయి కళ్లదుత్తలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.

పంట నమోదు జాబితా విడుదల



ఈ-క్రాప్ నమోదు జాబితాను పరిశీలిస్తున్న రైతులు

రాపూరు: రబీ సీజన్‌లో మండలంలోని రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు జాబితాను విడుదల చేసినట్లు ఏఓ సోమసుందర్ తెలిపారు. రాపూరు మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 1,564 మంది రైతులు సాగు చేసిన పంటను ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. ఈ-క్రాప్ నమోదు జాబితాను బుధవారం ఆయా రైతు భరోసా కేంద్రాల్లోని నోటీస్ బోర్డుల్లో డిస్‌ప్లే చేశామని చెప్పారు. పేర్లు నమోదు కాని రైతులు ఆర్బీకే సిబ్బందికి తెలిపితే, వారి పేర్లను జాబితాలోకి చేర్చుతామని చెప్పారు.

డీసీసీబీకి రూ.16 కోట్ల ఆదాయం

● చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.16.12 కోట్ల ఆదాయంతో ముందుకు సాగుతోందని ఆ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీ కార్యాలయంలో బుధవారం మహాజన సభ జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచి, బ్యాంకు నిలదొక్కుకునేందుకు రూ.70 కోట్ల సాయం చేశారన్నారు. ఇప్పటికే రుణాలు 91 శాతం రికవరీ అయ్యాయని చెప్పారు. రికవరీని 95 శాతానికి పెంచాలని ఆదేశించారు. జిల్లాలో పలు సొసైటీల ద్వారా 70 గోదాముల నిర్మాణానికి అనుమతి వచ్చిందని, కొన్ని తుదిదశకు చేరుకున్నాయన్నారు. నాబార్డు, ఆప్కాబ్ సహాయంతో సహకార రైతు వికాస్ పథకం ద్వారా 2022–23 సంవత్సరానికి 2,556 మంది రైతులకు రూ.117.87 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. బంగారు ఆభరణాల హామీపై రూ.174.24 కోట్లు, జగనన్న తోడు పథకం ద్వారా 1,353 మందికి రూ.1.35 కోట్లు, ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా 8,607 మందికి రూ.8.60 కోట్ల రుణాలిచ్చామన్నారు. ఈ నెలాఖరులోగా మరో రెండు మొబైల్ ఏటీఎంలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఎరువుల వ్యాపారానికి 11 సంఘాలకు రూ.2 కోట్ల బ్యాంకు గ్యారెంటీ ఇచ్చామన్నారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్ వెంకటరమణయ్య, ఖంతర్‌అలీ, రమణయ్య, సీఈఓ శంకర్‌బాబు, డీసీఓ తిరుపాల్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం రవిసింగ్, ఆప్కాబ్ జీఎం కృష్ణారావు, బ్యాంకు జీఎం సరిత, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, ఉషారాణి, నాగేంద్రకుమారి పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధి కోసం రుణాలు

డీసీసీబీలో చైర్మన్ సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో పాలకవర్గ సభ్యులు పలు కీలక తీర్మానాలు చేశారు. సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై ఏ ఇతర వాణిజ్య బ్యాంకులు ఇవ్వని రీతిలో 0.50 అత్యధిక వడ్డీ ఇచ్చేందుకు, స్వల్పకాలిక గరిష్ట రుణ పరిమితిని రూ.20 లక్షలు, స్థిరాస్తి తాకట్టుపై గరిష్ట రుణ పరిమితి రూ.25 లక్షలు, వ్యక్తిగత రుణాలను రూ.5 లక్షలు, చిరువ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను రూ.2 లక్షలు, గృహ నిర్మాణాలకు గరిష్టంగా రుణాన్ని రూ.75 లక్షలు, విద్యా రుణాలు రూ.20 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించారు.

నిరుపయోగంగా అంగన్‌వాడీ కేంద్ర భవనం

దొరవారిసత్రం: నెలబల్లి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ పిల్లల సౌకర్యార్థం గత ప్రభుత్వ హయంలో సుమారు రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. అప్పట్లో నిధుల లేమితో భవనం పనులను అర్ధాంతరంగా ఆగిపోయాయి. కొన్నేళ్లుగా పనులు పూర్తి కాలేదు. అప్పటి నుంచి ఈ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తుంది. దీన్ని ఎవరూ పట్టించుకోకుండా వదిలేయడంతో కొందరికి గోదాముగా ప్రైవేటు వ్యక్తుల పరమైందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం నెలబల్లి ఎస్టీ కానీలోని అంగన్‌వాడీ కేంద్రం ఓ ఇంట్లో కొనసాగుతుంది.

జాతరకు తరలిన భక్తజనం



ప్రత్యేక బస్సుల్లో బయలుదేరుతున్న భక్తులు

గూడూరు: ముత్యలమ్మ జాతరకు భక్త జనం బుధవారం నుంచే ప్రైవేటు వాహనాలతో పాటు, ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ నెల 14వ తేదీ మంగళవారం అమ్మవారి నిలుపుతో ప్రారంభమైన జాతర రెండో రోజైన బుధవారం నుంచి ప్రత్యేక కార్యక్రమాలతో జాతర సాగుతుంది. గురువారం జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ మేరకు అదే తరహాలో బస్సులను కూడా ఏర్పాటు చేయడంతో రద్దీ కొంత మేర తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అంబలి పంపిణీ



కోటలో వ్యాపారులు ఏర్పాటు చేసిన అంబలి చలివేంద్రం

కోట: కనుపూరు ముత్యాలమ్మ జాతరకు వెళ్లే భక్తులతో బుధవారం కోటలో రద్దీ నెలకొంది. కోట బజారువీధిలో వ్యాపారులు భక్తుల కోసం అంబలి, మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ఇక్కడ సేదతీరి అంబలి సేవించి ప్రయాణాన్ని సాగించారు. ఏటా కనుపూరుకు వెళ్లే భక్తులకు అంబలి పంపిణీ చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. అలాగే గ్రామదేవత కోటమ్మతల్లిని దర్శించుకునేందుకు భక్తులు రావడంతో ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు.

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మ జాతర చాటింపు



పోలేరమ్మ జాతర చాటింపు పూజలు చేస్తున్న పెద్దకాపు శ్రీనివాసులు రెడ్డి తదితరులు

● మే ఒకటో తేదీ నుంచి వేడుకలు

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ జాతరను మే నెల ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఈఓ పాయసం శాంతరావు తెలిపారు. పోలేరమ్మ జాతర మొదటి చాటింపు పూజలు మంగళవారం అర్ధరాత్రి దేవదాయ శాఖ అధికారులతో పాటు విన్నమాల గ్రామ పెద్దకాపు అరవ భూమి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గంధవళ్లి సిద్ధయ్య సారథ్యంలో జాతర చాటింపు పూజలను చేశారు. తొలుత అమ్మవారి పుట్టినిల్లుగా ఉన్న పడమటి వీధిలోని కుమ్మరిమిట్టలో పోలేరమ్మ మట్టి విగ్రహాన్ని తయారు చేసుకుని మెట్టినిల్లుగా ఉన్న శెట్టిపల్లివారివీధికి చేర్చి అలంకరించారు. అక్కడ నుంచి సమీపంలో బజారు నడివీధిలో అమ్మవారికి కుంభం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విన్నమాల గ్రామంతో పాటు నాయుడుపేట పట్టణానికి చెందిన అనేకమంది భక్తుల కిలారింపుల నడుమ అమ్మవారి మట్టి ప్రతిమను మార్కెట్ సమీపంలో వారధి వద్దకు తీసుకుని వెళ్లి నిమజ్జనం చేశారు. మొదటి చాటింపు అనంతరం జాతరను మేనెల 1న ఘటం, 2 తేదీ రాత్రి అమ్మవారి ఊరేగింపు, 3వ తేదీ తెల్లవారు జామున ఆలయం వద్ద అమ్మవారి ప్రతిష్ఠ, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నిమజ్జనంతో జాతర వేడుకలను ముగించనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ సభ్యులు నల్ల బోతులు రామారావు, గ్రామపెద్దలు ఆకులు కుబేరు మణి, రాగి శేషగిరి, మెస్ భాస్కర్ రెడ్డి, గాదిరెడ్డి గోపి, ఆలయ కమిటీ సభ్యులు దేవత చెంచు కిషోర్, కంపా మంజులమ్మ, వైఎస్సార్ సీసీ నాయకులు గంధవళ్లి భరత్, కాలగంధ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన సర్వసభ్య సమావేశం

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్ 1వ తేదీన ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ సింగయ్య బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో తాగునీటి ఎద్దడి, పారిశుద్ధ్యం తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని శాఖల వారీగా జరిగిన అభివృద్ధిపై ఆయా శాఖ అధికారులు తెలియజేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



గూడూరు: పరీక్ష హాల్లో ఉన్న విద్యార్థులు



రాపూరు: పరీక్షకు వస్తున్న విద్యార్థులు





రాపూరు: పరీక్ష హాలులో విద్యార్థులు



నాయుడుపేట: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు తల్లిదండ్రుల హడావుడి



వెంకటగిరి: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

గూడూరు: పట్టణంలోని ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు తొలిరోజైన బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీలు చేసి, పరీక్ష హాల్లోకి పంపారు. అలాగే ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

రాపూరులో..

రాపూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రత్యేక అధికారి సందాని బాషా తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో రాపూరు జూనియర్ కళాశాల, కండలేరు గురుకుల పాఠశాల, వినాయక జూనియర్ కళాశాలకు చెందిన 199 మందికి విద్యార్థులు గాను 193 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. ఒకేషనల్ పరీక్షకు 32 మందికి గాను 31 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

గురుకులంలో..

దొరవారిసత్రం: బీసీ గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మావిళ్లపాడు గ్రామంలోని ఆదర్శపాఠశాల, డీవీ సత్రంలోని కేజీబీవీ పాఠశాల, బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు మొత్తం 129 మందికి గాను 128 మంది తొలిరోజు పరీక్షలకు హాజరయ్యారు. అలాగే 41 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 31 మంది మాత్రమే హాజరైనట్లు స్థానిక ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలిపారు.

573 మంది హాజరు

కోట: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కోటలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు జూనియర్ ఇంటర్ తెలుగు పరీక్షకు కోటలోని ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలలో 309 మంది విద్యార్థులకు గాను 297 మంది హాజరయ్యారు. విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో 285 మందికి గాను 276 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు తెలిపారు.

గురుకులంలో 923 మంది..

నాయుడుపేట: పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. 923 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 32 మంది గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో 891 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. నాయుడుపేట బాలుర గురుకుల పాఠశాల, శ్రీవేమ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలైన మూడు కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. గురుకుల పాఠశాలలో సిటింగ్ స్క్వాడ్, కస్టోడియన్ మాధవిదేవి పరీక్ష కేంద్రాల్లో పర్యవేక్షణ చేశారు.

తొలిరోజు ఆరుగురు గైర్హాజరు

వాకాడు: వాకాడులోని బాలయోగి గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇంటర్ పరీక్షలకు మొత్తం 232 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 226 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రామానుజం తెలిపారు. ఆరుగురు వివిధ కారణాలతో గైర్హాజరైనట్లు చెప్పారు.

వెంకటగిరిలో ప్రశాంతం

వెంకటగిరి: ఇంటర్మీయట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, ఎస్‌బీఎస్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు నిర్వహించిన తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలకు మొత్తం 1,035 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 40 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల ప్రిన్స్‌పాళ్లు తెలిపారు. నిమిషం ఆలస్యం అయినా అనుమతి లేదన్న నిబంధనతో విద్యార్థులు ఉరుకుల పరుగులతో ఉదయం 8.00 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలి



బాలాయపల్లి మండలం పెరిమిడి పంచాయతీల్లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

వెంకటగిరిరూరల్: అర్హత ఉన్న ప్రతి కూలీకి గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. వెంకటగిరి రూరల్ మండలంలోని చిన్నపేట, బాలాయపల్లె మండలంలోని పెరిమిడి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నూరుశాతం పనిదినాలు కల్పించి, మస్టర్‌లు, ఎంబుక్‌లో వివరాలు పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు దీప, హరి తదితరులు పాల్గొన్నారు.

వందరోజులు పనులు కల్పించాలి

ఓజిలి: ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మండలంలోని మనవాలి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో పనులను గుర్తించి, సర్పంచ్ ఆధ్వర్యంలో వాటికి ఆమోదం తీసుకోవాలన్నారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు టీఏలు పరిశీలించి బిల్లులు నమోదు చేయాలని సూచించారు. వేసవిలో కూలీలకు తాగునీరు, గుడారాలు ఏర్పాటు తదితర వాటిపై శ్రద్ధ చూపి, కూలీలకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం మస్టర్‌లను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఉషారాణి, టీఏ మహేష్‌కుమార్, ఎఫ్ఏ వేణు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కలశస్థాపన



కలశాలను ఆలయానికి తీసుకుని వస్తున్న భక్తులు

చిల్లకూరు: మండలంలోని చింతవరం కొత్తపాళెంలో నూతనంగా నిర్మించిన అంకమ్మ తల్లి దేవస్థానంలో బుధవారం భక్తిశ్రద్ధల నడుమ కలశ స్థాపన చేపట్టారు. ముందుగా గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఏడు బావుల నుంచి జలాలను తీసుకుని వచ్చి కలశాలలో నింపి, ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ గ్రామంలో ఊరేగించి, వాటిని దేవాలయం వద్ద ప్రతిష్ఠించారు. అనంతరం అంకమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. ఈ కార్యక్రమంలో చింతవరం ఎంపీటీసీ సభ్యురాలు మాధవి, శ్రీనివాసులు, మొగిలిగుంట రవి తదితరులు పాల్గొన్నారు.